క్లుప్తంగా

నేడే దుర్గమాంబ పండగ



టెక్కలిపాలెంలో కొలువైన దుర్గమాంబ

సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెం గ్రామంలో కొలువైన శ్రీదుర్గమాంబ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఎన్ఆర్ఐ గొంప వెంకట రమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీల్లో సుమారు 26 జట్లు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రధాన పండగ రోజైన మంగళవారం రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు గొంప వెంకట రమణ, గ్రామ పెద్దలు పైల వెంకటరమణ, గొంప నాయనప్ప,భర్ణికాన బాబూరావు, పీబీవీఎస్ఎన్ రాజు,గండి రవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఉత్సవాలకు ఏర్పాట్లు



బొడ్డపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ

పరవాడ: మండలంలోని ఈ. బోనంగి శివారు బొడ్డపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ గ్రామ దేవత పండగను ఈ నెల 6న వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయాన్నివిద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం ఉదయం నుంచి భక్తులు గ్రామ దేవత దుర్గమాంబను దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. ఆ రోజు రాత్రి అమ్మవారిని చిడతలు, భజనలు, డ్యాన్సులు, డప్పువాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం భారీ బాణ సంచాకాల్పులతో అమ్మవారి అనుపోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ బొడ్డపు శ్రీనివాసరావు చెప్పారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రదర్శిస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: మండలంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం విస్తృత ప్రచారం చేశారు. ముత్యాలమ్మపాలెంలో సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు మాట్లాడుతూ ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం నిర్వహించడం సంతోషించాల్సిన విషయమన్నారు. 100 త్రైత సిద్ధాంత గ్రంథాలను ఆమె కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అమ్మోరు, లంకెలపాలెం పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, ప్రభోద సేవా సమితి సభ్యులు అక్షయ్, రాము, రమణ, నాయుడు, మీనా, బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

సింహాచలం: వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను మంగళవారం పెందుర్తిలోని డీఆర్సీ కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందని నాయకులంతా హాజరుకావాలని పేర్కొన్నారు.

పెందుర్తిలో..

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని చెక్ అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,అధికారులు, పార్టీ నాయకులు పాల్గొవాలని ఆమె పిలుపునిచ్చారు.



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద క్యూ కట్టిన పదోతరగతి విద్యార్థులు

‘పది’ పరీక్షలు ప్రారంభం



పరీక్ష హాల్లో విద్యార్థులు

- పలు పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి



ప్రతిభా విద్యాలయంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి తిరిగి వస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సబ్బవరం:పెందుర్తి నియోజకవర్గం పరిధిలో పదోతరగతి పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రతిభా విద్యాలయాల్లో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్షలకు సంబంధించి మండలంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలు, విద్యార్థుల వివరాలపై మండల విద్యాశాఖాధికారి అప్పలరాజును ఆరా తీశారు. అదేవిధంగా సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని విద్యాశాఖ ఆర్జేడీ ఎం. జ్యోతి కుమారి పరిశీలించారు. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు 1,016 మంది హాజరుకావాల్సి ఉండగా 1,008 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో ప్రతిభా విద్యాలయంలో ఇద్దరు,మదర్ పబ్లిక్ స్కూల్‌లో ఐదుగురు,రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకరు గైర్హాజరయ్యారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రంగనాథం తదితరులు ఉన్నారు.



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మహతి స్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



పరవాడ బాలికల పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులు

నిఘా నీడలో..

పరవాడ: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో పెదముషిడివాడ, లంకెలపాలెం, తానాం, పరవాడ బాలురు, పరవాడ బాలికలు, వాడచీపురుపల్లి, పరవాడ సుమేధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 8 గంటలకే తల్లిదండ్రులు తమ విద్యార్థులతో వచ్చి నిరీక్షించారు. పదో తరగతి పరీక్షలకు వివిధ పాఠశాలల నుంచి 623 మంది బాలురు, 655 మంది బాలికలు హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, వాచీలు, వాటర్ బాటిళ్లను అనుమతించలేదని ఎంఈవో సునీత చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తొలి రోజు ప్రశాంతంగా..

సింహాచలం: పదోతరగతి పరీక్షలు అడవివరం, పెందుర్తి మండలంలోని ప్రశాంతంగా జరిగాయి. సింహాచలం దేవస్థానం సాంస్కృతిక ఉన్నత పాఠశాలలో 251మంది, అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 220 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అలాగే పెందుర్తి మండలంలో మొత్తం 12 కేంద్రాల్లో 3064 మందికి కేటాయించారు.

అభిషేకాలు.. అర్చనలు



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

అలరించిన భక్తి విభావరి



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న భార్గవి

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన భక్తి విభావరి అలరించింది. సింహాచలానికి చెందిన ఎం.భార్గవి అన్నమాచార్య కీర్తలు ఆలపించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

6న ఆలయాల్లో సామూహిక హారతి

- హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ విడుదల



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న రమణమ్మ తదితరులు

సబ్బవరం: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు విస్తృతం చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం మండల సమావేశం నిర్వహించారు.ఈ నెల 6వ తేదీన సామూహిక హారతి కార్యక్రమం,ధార్మిక జట్ల నిర్మాణం,మండల కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. వారం వారం దేవాలయం కేంద్రంగా భజనలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ నెల 9వ తేదీన అనకాపల్లి శ్రీసూర్యనారాయణ దేవాలయం నుంచి శారదా బ్రిడ్జి వరకూ హనుమాన్ శోభాయాత్ర జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను సబ్బవరం మూడు రోడ్ల కూడలిలోని హనుమాన్ ఆలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల మహిళా కన్వీనర్ పెద్దాడ రమణమ్మ,పి. వరలక్ష్మి, సి. వరలక్ష్మి, ఎస్. రవణతల్లి,అనకాపల్లి కన్వీనర్ వెంకటరమణ,వి. వంశీ కృష్ణ, పరవాడ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో చందనోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు



ట్రస్ట్‌బోర్డు సభ్యులు, సెక్షన్ హెడ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: ఈనెల 23న వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవాన్ని సమన్వయంతో పనిచేసి విజయవంతం చేద్దామని సింహాచలం దేవస్థానం దేవస్థానం ఈవో త్రినాథరావు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, పలు విభాగా అధికారులకు సూచించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించడంలో కీలక భూమిక పోషించారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో చందనోత్సవాన్ని విజయవంతం చేద్దామన్నారు. ఈవో సోమవారం సింహగిరిపై ట్రస్ట్‌బోర్డు సభ్యులు, పలు విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందనోత్సవంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాది జరిగిన లోటుపాట్లపై చర్చించారు. కాగా చందనోత్సవం రోజు తమకు సరైన గౌరవం ఇవ్వడం లేదని పలువురు ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి వాటిని సరిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, సువ్వాడ శ్రీదేవి, శ్రీదేవివర్మ, రాజేశ్వరి,సాయి నిర్మల,కృష్ణమూర్తి పాత్రుడు, పద్మ, ప్రత్యేక ఆహ్వానితులు చందుయాదవ్, శేషారత్నం, డిప్యూటీ ఈవో సుజాత, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు రమణమూర్తి, ఆనంద్‌కుమార్, ఇజిరోతు శ్రీనివాసరావు, నరసింహరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పోర్టిఫైడ్ రైస్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాగులు, జొన్నలు వంటి చిరు ధాన్యాలతో చేసిన వంటకాలను తిలకించారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యవంతమైన పిల్లలతో వెల్‌బేబీ షో నిర్వహించారు. సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, నాయకులు పైల అప్పలనాయుడు, చీపురుపల్లి సన్యాసిరావు, ఏఎన్ఎంలు రత్నం, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఎంటీపీ కోసం 29 ప్రైవేటు ఆస్పత్రుల దరఖాస్తు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) సమావేశం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మొత్తం 29 ప్రైవేటు ఆస్పత్రులు ఎంటీపీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వాటిని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. గైనకాలజీ టీం సభ్యులు ఆయా ఆస్పత్రులను సందర్శించి ఎంటీపీకి సంబంధించి వైద్యుల అర్హతలు, పరికరాలు ఉన్నాయో? లేదో? పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. అనంతరం నివేదికపై చర్చించి అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కేజీహెచ్ గైనాలజిస్ట్ డాక్టర్ ఐ.వాణి, వుమన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, కేజీహెచ్ మత్తు డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రసవాలపై సమావేశమై చర్చించారు.

గ్రూప్ లెర్నింగ్‌తో మెరుగైన అవగాహన



సాంబశివరావును సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు

ఏయూ క్యాంపస్: గ్రూప్ లెర్నింగ్‌తో మెరుగైన అవగాహన కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ఎన్. సాంబశివరావు అన్నారు. సోమవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి ఆయన విశిష్ట ప్రసంగం చేశారు. వార్తా పత్రికల్లో ఎడిటోరియల్ పేజీ ఎంతో ప్రధానమన్నారు. దీనిని చదవడం వల్ల విభిన్న అంశాలపై లోతైన అవగాహన ఏర్పడుతుందని, పోటీ పరీక్షల సమయంలో ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని చెప్పారు. నిర్దిష్ట విధానాలు అమలు చేస్తూ సంక్షేమ పథకాలు అందరికీ అందించాలన్నారు. పరీక్షలకు సన్నద్ధం అయ్యే విధానం, అవకాశాలు తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార జాలాది రవి, ఆచార్య పి.విశ్వనాథం, ఆచార్య జి.సుదర్శన్‌రావు, రిటైర్డ్ ప్రొఫెసర్ డి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావును విభాగం తరపున సత్కరించారు.

ఘనంగా పోలమాంబ తొలేళ్ల ఉత్సవం



పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో సురేష్ బాబా తెలిపారు.

నేడు వార్షిక జాతర

పండగలో భాగంగా ప్రధాన ఘట్టం అనుపు మహోత్సవం, వార్షిక జాతర మంగళవారం జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని వివిధ రంగులు పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని ఇలవేల్పుగా కొలిచే పెదవాల్తేరు చుట్టుపక్కల 14 గ్రామాల ప్రజలు ఈ పండగకు తరలిరానున్నారు. పోలమాంబ ఆలయంలో పని చేస్తున్న 20 మంది సిబ్బందితో పాటు దేవదాయశాఖకు చెందిన సిబ్బంది 50 మంది వరకు ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచి నీరు, మజ్జిగ పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రాథమిక వైద్య శిబిరం, ప్రసాదాల విక్రయాలకు ప్రత్యేక, అదనపు కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత, రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంచారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి తెలిపారు.

- పోలమాంబ పండగ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం అదనపు పోలీసు సిబ్బంది ఆలయం వద్దకు చేరుకుని భద్రత చర్యలో భాగమయ్యారు. మూడో పట్టణ సీఐ కోరాడ రామారావు సిబ్బందికి తగిన సూచనలు చేసి, విధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాము, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఉక్కు నిర్వాసితుల పాదయాత్ర



నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15 నుంచి పాదయాత్ర చేపట్టనున్నామని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి తెలిపారు. పెంటమాంబ ఆలయం వద్ద నిర్వాసితులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 780 రోజులుగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే కార్యక్రమంలో భాగంగా పాదయాత్రను తలపెట్టామన్నారు. ఈ యాత్ర ఈ నెల 15న ఉదయం నడుపూరు గాంధీ విగ్రహం నుంచి సింహాచలం దేవస్థానం వరకూ నిర్వహించనున్నామని వివరించారు. ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నమ్మి సింహాద్రి, ధర్మాల కనకరెడ్డి, నంబారు సింహాద్రి, నామాల శ్రీకాంత్, రామిరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

పరవాడ: దలాయిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం 7 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం జరుగుతుంది. సమావేశానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు పాల్గొవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కోసం 132/33కేవీ సింహాచలం లైన్ పరిధిలోని గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్‌లోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్ఏడీ, బుచ్చిరాజుపాలెం, గాంధీనగర్, ఇందిరాప్రియదర్శిని కాలనీ, బాజీ జంక్షన్, గోపాలపట్నం, నరసింహనగర్, చంద్రనగర్, యల్లపువానిపాలెం, పాత గోపాలపట్నం ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నూతన విభాగాధిపతికి అభినందనలు



స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పీ నూతన విభాగాధిపతిని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ) విభాగంలో సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకోవాలని స్టీల్ ఇంటక్ నాయకులు కోరారు. ఆర్ఎంహెచ్‌పీ నూతన విభాగాధిపతిగా పరుచూరి శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇంటక్ నాయకులు సోమవారం ఆయనను కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా విభాగం సమస్యలను నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు. విభాగంలో పదవీ విరమణ, మృతి చెందటం వంటి కారణాల వల్ల సిబ్బంది గణనీయంగా తగ్గిపోయారన్నారు. విభాగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీరుకొండ రామచంద్రరావు, బి.ఎస్. రాజు, ఎ. రాజేశ్వరరావు, గోవిందరాజు, ఎల్లాజీ, కొండ రాజు, వేమన రమేష్, సురేంద్రబాబు, కారి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు

హీరో హోండా షోరూంలో చోరీ

సింహాచలం: చినముషిడివాడలోని హీరో హోండా షోరూంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి షోరూం మూసేసి నిర్వాహకులు ఇంటి వెళ్లిపోయారు. ఆదివారం సెలవుదినం కావడంతో షోరూం తెరవలేదు. సోమవారం ఉదయం షోరూమ్ తెరవగా కిటికీ అద్దాలు పగిలి ఉన్నట్టు గమనించారు. లోపలకి వెళ్లి చూడగా షోరూంలోని రెండు మొబైల్ ఫోన్లు, రెండువేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. పెందుర్తి క్రైమ్ ఎస్ఐ సల్మాన్‌బేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

సింహాచలం: పేకాట ఆడుతున్న ఆరుగురుని పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. నాయుడుతోటలోని ఒక హోటల్‌లో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఆరుగురుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.47వేల నగదు, 6 మొబైల్ ఫోన్లు నుంచి స్వాధీనం చేసుకుని పెందుర్తి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు.